# 'కలం పట్టని కర్తల సంఘం'

## (ని వే ది క)

కలం పట్టని గ్రంథకర్తలసంఘం అని వుండాలి, కాని కలంపట్టనివ్యక్తి ఎల్లా గ్రంథకర్తగా పరిగణింపబడతాడో అర్థం కాక అల్లా వొదిలేశాం. ఈ సంఘం సహాయకార్యదర్శిగా వార్షికోత్సవసమావేశం కార్యకలాపాలనివేదిక సమర్పించే భారం నామీద పడినందుకు చింతిస్తున్నాను. శ్రద్ధగాచూస్తే మా సంఘం సమర్పించే నివేదిక స్వరూపం యీ క్రిందివిధంగా వుండాలి.

---

### వార్షికోత్సవ నివేదిక

ఇట్లు
క. ప. గ్ర. క. సం.
సభ్యులు

---

కాసేపు మా ఆదర్శాలు అవతలగావుంచి, పాఠకలోకానికి మా సంఘంపుట్టుపూర్వోత్తరాలు, ఆశయాలు, యీ యేడాదిలో జరిగిన కృషి వివరించడం మా విధి కాబట్టి, యీ రచనకి పూనుకుంటున్నందుకు సభ్యులు మన్నించాలని కోరుతూ వుపక్రమిస్తున్నాను.

కలంపట్టని గ్రంథకర్తలసంఘం నిర్మాత అధ్యాత్మయ్య గారు. వారు అరవై సంవత్సరాల క్రితం ఎడారిపురంలో ఖాళీ పేటలో 'మృగ్యం' అనే భవనంలో జన్మించారు. పదహారవ ఏట స్నేహితులకు సెలవుల్లో పెద్దపెద్ద లేఖలు వ్రాయడంతో గ్రంథకర్తగా ఆయనజీవితం ప్రారంభమైందనవొచ్చు. వారి అరవై మూడోఏట కళాశాల సంచికలో కొన్ని గేయాలు వెలువడ్డాయి. మొదటి ప్రపంచ సంగ్రామం గురించి, వివిధ పత్రికలలో వారి విమర్శలు 'అనామకుడు' అను పేరిట ప్రచురితమై ఆంధ్రపాఠకలోకానికి రాజకీయాలపట్ల కళాభూయిష్ఠమైన అభిరుచి కలగజేసి పత్రికాసంపాదకీయం కళాఖండం కాగలదని ఋజువుచేశాయి. 'సాహితీబాణం' అనే మాసపత్రికలో కవిత్రయంవారిని గూర్చిన వారి వ్యాసాలతో విమర్శకుడుగా అగ్రస్థానం సంపాదించుకున్నాడు. మరో ఇరవై ఏళ్ళతర్వాత 'ప్రళయం' 'వితండవాదం' అనే వారినాటకాలు వూరూరా ఆడడంతో సారస్వత చక్రవర్తిగా వారికీర్తి స్థిరపడిపోయింది. వారి రచనలను గూర్చి ఆయన చెబుతూండగా విని మతిపోయిన నాబోటి కుర్రకారు అందరం, నిరుడు వారి షష్ఠిపూర్తికి పూనుకున్నాం. అతికష్టంమీద ఆయనని వొప్పించాం. షష్ఠిపూర్తి సందర్భంలో వారి రచనలన్నీ సేకరించి, ప్రముఖుల వ్యాసాలతో, విమర్శలతో చేర్చి వో గ్రంథంగా వెలువరించి వారికి సమర్పించాలని సమకట్టి, తమ రచనలన్నింటినీ మాకివ్వవల్సిందిగా వారిని కోరాం.

'నేను చెప్పినవన్నీ వ్రాయలేదు. నే నింతవరకూ ఏ రచనా చెయ్యలేదు. ఆ రచనలన్నీ చేసివుందును. చెయ్యగల

ప్రతిభ నాలో వుంది. కాని దాన్ని చంపుకుని వొక తాత్విక చింతన అలవరుచుకుని, అహాన్ని త్యాగంచేసి, యీ సారస్వత అవకాశాలను యితరులకి విడిచిపెట్టి, ఏకాంతంలో నిశ్చింతగా కాలం గడపదలచాను' అన్నారు అధ్యక్షయ్యగారు. వా రింకా యిల్లా అన్నారు:

'నేను చేసిన త్యాగం సామాన్యమైంది కాదు. దాని విలువ నా సమకాలికులు గ్రహించలేరు. ఈనాడు నేను ప్రారంభించిన పనికి ఎందరో పూనుకోవాలి. ఇదొక వుద్యమంగా ప్రచారంలోకి రావాలి. ఎన్నెన్నో భావాలు నా బుర్రలో మెదిలాయి. ఎన్నెన్నో మధురస్వప్నాలు నా హృదయంలో కరిగిపోయాయి. కావ్యాలు, నాటకాలు, విమర్శలు, నవలలు, కథానికలు, వేలాదిగా వ్రాసివుండును, కాని వ్రాయలేదు. అట్లా వ్రాయకపోవడంలోనే నా త్యాగం వుంది. ఇదొక సమాజసేవ. పూర్వీకుల గ్రంథాలు, సమకాలికుల రచనలు వేలాదిగా వున్నాయి. ఇతరభాషలలో లక్షలాది గ్రంథాలు బైలుదేరుతున్నాయి. వీటిల్లో ఏదని చదవడం? పాఠకుడికి మతి పోతుంది. ఈ సారస్వతజ్వాలలో నేనూ వో గ్రంథాన్ని సమిధగా పారేసి ప్రజ్వరిల్లచెయ్యమంటారా? మన పూర్వులు బోధించినదాన్ని ఆచరణలోపెట్టి జితేంద్రియుడనై స్వార్థాన్ని చంపుకుని ఆధ్యాత్మికానుభూతినిపొంది, సత్ చిత్ ఆనందాలను సాధించి పరమాత్మలో ఐక్యంకావడం గొప్ప కృషి, త్యాగం, సాధన కావంటారా? పరమాత్మను దర్శించిన వ్యక్తికి చెప్పేటందుకు అనువైనభాష లేదు మౌనమే అతని శరణ్యం. ఈ తత్వాన్ని అంగీకరించి, ఎందరెందరో యీ వుద్యమానికి చేయూ

తనిచ్చి సారస్వతసేవకి వుపక్రమించాలి. ఈ నా సందేశాన్ని కూడా మీరు ప్రచురించకూడదు. నేను వ్రాయకూడదు. ఎవ్వరూ వ్రాయకుండానే యీ మహా సత్యం ప్రచారంకావాలి కలంపట్టని గ్రంథకర్తని నేను' అన్నా రాయన.

ఆక్షణాన్నే యీ సంఘం జనించిం దనొచ్చు. వారినే అధ్యక్షులుగాకూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నాం. ఆ సందర్భంలో వారికి సమర్పించిన సన్మానపత్రంలో యిల్లా చెప్పుకున్నాము.

'మీరు రచించని 'రెండు మహా సంగ్రామాలు' అనే నవల మీ కీర్తిని వేనోళ్ళచాటుతూంది. ఆంధ్రుల మహోజ్వల జీవితం అందులో చక్కగా చిత్రితమై వుండివుండును. ఈనాడు సమాజాన్ని కలచివేస్తున్న సమస్యలన్నింటికీ పరిష్కారమార్గాలు సూచించివుండును. వాటిని యీ సమాజం అలవరుచుకొనివుండును. అట్లయిన సంఘసంస్కర్తలకీ, ప్రజాసేవకులకీ చేసేటందుకు ఏమీలేక నిరుద్యోగులై, రచనకి పూనుకుని మరికొన్ని క్రొత్తసమస్యలు లేవదీసివుందురు. మీ నవల యీ ప్రమాదం తప్పించింది. అంతేకాదు. ఆ నవలను చదివి ఎందరో యువకులు నవలారచనకు పూనుకొని, యీనాటి సారస్వత కల్లోలాన్ని పెంచివుందురు. ఈ విపత్తు సంభవించకుండా మీరు తలపెట్టిన నవలను వ్రాయకుండా విడిచిపెట్టినందుకు దేశం మీకు ఋణపడివుంది.' ఇది చదవగా విని అధ్యక్షుయ్యగారు యీసన్మానపత్రం వ్రాతలో వుంది గావున, వెంటనే తగులపెట్టవల్సిందని ఆజ్ఞాపించారు. అప్పుడు దాన్ని ఫ్రేమునుండి విడదీసి, అప్పుడే తగులపెట్టివేశాము. ఇదిచూచి విస్తుపోయిన సభికులలో కొందరు మా సంఘంలో సభ్యులుగా చేరిపొయ్యారు.

వ్రాయకుండానే గ్రంథకర్తలుగా పేరుకొట్టెయ్యడానికి సంకల్పించిన వ్యక్తులకు కొదవేమిటి? కొన్నికోట్లమంది యిందులో సభ్యులుగా చేరిపోతారు - అనుకుంటున్నారేమో మీరు. ఇది నిజమైతే మా సంఘంలో కొన్నికోట్లమందిసభ్యులు చేరివుందురు. కాని అట్లా కాదు. సభ్యత్వానికి కొన్ని అర్హతలున్నాయి. వాటిని పాటించగలవారు చాలా కొద్దిమందే వుంటారు. ఈసంఘం అవతరించినప్పుడు, ఏ డజనుకుమించి సభ్యులులేరు. ఈ డజనుమందిలోకూడా సంపూర్ణమైన అర్హతసంపాదించుకున్నవారు వొక్కరూకూడా లేరనడంలో అతిశయోక్తి లేదు. మా 'మధురాంతకం' విషయం చూడండి. లోగడ వొకటి రెండు గేయాలు వ్రాసివున్నాడు. మా 'హాంగుదారు' 'తుషారం' అనే గేయసంపుటి ప్రచురించి 'ముంగిస'కు అంకితంచేశాడు — ఎందుకో ఎవ్వరికీ తెలీదు. 'రణవీర్' రెండో ప్రపంచ సంగ్రామసమయంలో వాల్‌పోస్టర్లమీద యుద్ధంలో చేరవల్సిందిగా కొన్ని పాటలు - ('రణభేరి'గా తర్వాత ప్రచురించా లనుకున్నాడట) -వ్రాశాడు. మా వే. ఘో. వి. శాస్త్రి (వేదఘోష విచ్ఛిన్నశాస్త్రి) ఋగ్వేదకాలంనాటి సోమపానాస్వాదనాఔచిత్యంగూర్చి వాఖ్య వ్రాశాడు. మా 'స.కు.బ' గారు ఉద్యోగం యివ్వనందుకు నలుగుర్ని తిడుతో వ్రాసిన వుత్తరాలను 'ప్రేమలేఖలుగా' అచ్చాఫీసులో ఏడాదిగాపడున్న వ్రాతప్రతిని గబగబ వెళ్ళి తీసుకొచ్చి అధ్యక్షయ్యగారిపాదాల ముందు పడేస్తేనే సభ్యత్వం లభించింది. దాన్ని తగులబెట్టడం గూర్చి గంటసేపు చర్చకూడా జరిగింది. అధ్యక్షయ్యగారు దాన్ని తగులపెట్టవద్దనీ, ప్రస్తుతం పూడ్చిపెట్టవల్సిందనీ ఆజా

పించారు. - రాసెట్టి అనే ఆంగ్లకవి కొన్ని ప్రేమగీతాలను అవిధంగా ప్రేయసితో పాటు పూడ్చిపెట్టాడుట-ఎప్పుడైనా యీ సంఘంతో అభిప్రాయభేదాలొచ్చి సభ్యుడుగా మానుకున్నా డు, వారికి యీ వ్రాతప్రతి తిరిగి తీసుకొని ప్రచురించుకొనే అధికారం వుందాలన్న ప్రతిపాదన ఆమోదించారు. ఏదో వాళ్ళ అపచారం చెయ్యనివారు మాలో లేరు. కృష్ణయ్యగారు ఏమీ వ్రాయలేరుగాని, వాళ్ళరిద్దరు యువకవులు తమ గేయసంపుటాలను వీరికి అంకితం చేశారుట. మా 'మరమ్మత్' నో చిన్ని కథాసంపుటాలకి పరిచయవాక్యాలు వ్రాశారు. ఆ గ్రంథం వాళ్ళ సినిమానటికి అంకితం యివ్వడంతో వేసిన రెండువేల కాపీలు అట్టే అమ్ముడైపోయినాయి. వాటినన్నింటినీ సేకరించి తగులబెట్టే సంకల్పం సంఘంవారికి వుందిగాని, కొనసాగుతుందని మేం అనుకోవడంలేదు. ఇంకెప్పుడూ వుపోద్ఘాతాలు వ్రాయనని వొట్టేసుకున్న మీదనే 'మరమ్మత్'కి సభ్యత్వం దొరికింది. 'వైవాహిత్' అనే మరో సభ్యుడున్నాడు. తనెప్పుడూ వ్రాసిన పాపానపోలేదని ప్రమాణం చేసినా, గిట్టనివారు ఆయనరచనని వొకదాన్ని బైటపెట్టారు. ఎవరిదో ధనికకుటుంబంలో వివాహం జరిగిందట. ఆ సందర్భంలో వధూవరుల మంచిగుణాలన్నింటిని గుచ్చెత్తి గేయమాలగా పెండ్లిపందిట్లో చదివి, ఫ్రేమ్ కట్టించి పెండ్లికుమారునికి సమర్పిస్తూండగా తీసిన ఫొటో బైటపెట్టడంతో ఆయనబండారం బైటపడింది. పాపపరిహారంగా ఆయనకలాన్ని అధ్యక్షయ్యగారికి యిచ్చివేశారు. అప్పుడు, ఫౌంటెన్‌కలాలు ప్రవేశిస్తుండగా నిశ్చితమైంది. ప్రతిసభ్యుడు వో కలం, దస్తా కాగితాలు, సంవత్సరం చందాగా కట్టాలి. వారు

లోగడ చేసిన రచనలుంటే ఆ ప్రతులన్నింటినీ సేకరించి వార్షికోత్సవంలో వాటిని దగ్ధం చెయ్యాలని తీర్మానించారు. ఇదంత కష్టంకాదు. ఎందుకంటే అచ్చువేసిన ప్రతులన్నీ సాధారణంగా గ్రంథకర్తగారింటి బోషాణంలోనో, ప్రచురణకర్త చెత్తకాగితాలకొట్లోనో, సులువుగా దొరకుతాయి. వార్షికోత్సవంలో ప్రతిసభ్యుడూ ప్రసంగించితీరాలి. ఆ ఏడాదిలో ఆయనఊహలో కాగిన భావాలు, తలపెట్టినరచనలూ, వాటిని వ్రాయకుండా ఎల్లా తప్పించుకున్నదీ వివరించాలి. గొప్పరచన తలపెట్టి వ్రాయనందుకు అధ్యక్షులు కొన్ని బిరుదులుకూడా యివ్వాలని సూచించారు. 'మధురాంతకం' 'కన్నీటిస్వర్గం' అనే ఖండకావ్యం వ్రాయలేదుట వారికి 'నహీ కన్నీర్ కవి' అని బిరుదు యిద్దామన్నారు. దానికి నేను తగను అని నమ్రతతో ఆయన నిరాకరించారు. 'ఏమో, ఆ కావ్యం నేను ముందెప్పుడూ వ్రాయనూ అనలేను. ఏవేళ ఏబుద్ధిపుడుతుందో' అన్నాడు 'మధురాంతకం.' ఆయన నిజాయితీని అధ్యక్షులు ప్రశంసించారు. ఈ సంవత్సరం ఉపనిషత్తులజోలికి పోలేదు అన్నాడు వే. ఘో. వి. శాస్త్రి. భాసుని ఏకాంకిల విషయమై పరిశోధనచేసికూడా వ్యాసాలు వ్రాయడం మానుకున్న వుదంతం విని సభ్యులు సంతోషించారు. వొకటి రెండుమార్లు బౌద్ధతత్వం గురించి వ్రాయాలని వుబలాటపడ్డారుట. మరోమారు శంకరాచార్యుల చరిత్ర సినిమాకి పనికొచ్చేటట్లు వ్రాయాలనుకున్నారు. 'నాగానందం' తనని విస్మరించవల్సిందిగా చేసిన ఆహ్వానాన్ని పెడచెవినిపెట్టాడుట. చివరికి ముద్దువళని మధురంగా పిల్చినా విని

పించుకోనందుకు ముందుముందు అధ్యక్షపదవిని కొట్టెయ్య డానికే ఆయన కృషిచేస్తున్నట్టు స్పష్టమైంది.

'హంగుదాకు' 'మిల్లుయజమాని' అనే సాంఘికనాటకం ఆరంభించి, వొక రంగం పూర్తికూడా చేశాననీ, తరువాత అతనికి మిల్లులో పని దొరికిందనీ, అంతటితో ఆ వ్రాతప్రతిని మిల్లులో విద్యుత్ చక్రాలమధ్య పడేసి పిండిగాచేసిన ఘట్టం విని, మేమం పరంచకితులమయ్యాం. మా రణవీర్ హిందీ, వంగభాషలనుండేగాక, 'సరోయన్' ప్రీస్ట్లీల రచనలు తెలుగులోనికి అనువదించడానికి పూనుకుని, కీర్తికాంత పిలుపుని కాదని ఆమెను పంపించివేసి లోపల గొళ్ళెంపెట్టుకుని ముసుగుతన్ని పడుకున్నదృశ్యం వూహించుకుని సభికులు కరతాళధ్వనులుచేశారు. ఇక 'స.కు.బ.' వయస్సులో పిన్నైనా, త్యాగంలో మా అందరికంటె పెద్ద—ఎందుకంటారా—నాలుగైదు అపరాధ పరిశోధక నవలలకి కావల్సినవస్తువు సిద్ధంగా వుండికూడా, వాటి రచనకు పూనుకోలేదు. వొకరిద్దరు పంపిన నవలలపై అభిప్రాయం వెలిబుచ్చలేదు. ఆఖరికి ఆరకం నవలల్ని చదవాలన్న తృష్ణనికూడా అణగద్రొక్కుకుని మానసిక ప్రశాంతతని పెంపొందించుకున్నాడట. 'నహి హంతక్' బిరుదుపొంది అధ్యక్షుల వారి మన్ననకు పాత్రుడయ్యాడు. మా కృష్ణయ్య పిల్లల సాహిత్యంజోలికి ఈసంవత్సరం పోలేదు. 'వారు హాయిగా ఆడుకుంటూ, పాడుకుంటూ వుండకుండా నా బాలసాహిత్యంతో తత్ఫలితంగా జనించే పోటీతత్వంలో వారిఆనందమయ, అమాయకపు జీవితాలను భగ్నంచెయ్యడం నా మతంకాదు. నేనేకాకుండా

పెడతోవకిపట్టించే తోటిరచయితలమాటలువిని, ఆ బాలబాలికలు రచనకి పూనుకోకుండా, వారిజేబుల్లో పెన్సిళ్ళు, బలపాలు, సుద్దముక్కలూ సంగ్రహించి, చోరత్వానికి దిగవల్సివచ్చింది' అన్నాడు కృష్ణయ్య తన సారస్వతానుభవాలను వివరిస్తూ.

మా సంఘంలో మహిళలు సభ్యులుగా చేరలేదు. అందుచేత మహిళా సాహిత్యలోకానికి 'మేము ఏ సహాయము చేయలేకపోయామని చెప్పేటందుకు విచారిస్తున్నాను.

ఈ ఏడాదిలో మా సంఘం సభ్యులసంఖ్య వొందకి పెరిగింది. మొన్న జరిగిన వార్షికోత్సవానికి అధ్యక్షయ్యగారు అధ్యక్షులుగా వున్నారు. ఆ ఉత్సవం ప్రారంభించడానికి ఎవరిని పిలవాలా అన్న విషయంపై రెండు మూడు గంటలు వాదోపవాదాలు జరిగినవి. 'మనం ఎవరినో వొక ప్రముఖ వ్యక్తిని పిలుస్తాం. మనమాట తీసెయ్యలేక వారు వొస్తారు. దానివల్ల వారు చెయ్యవలసినపనులు చెయ్యనీకుండా చేస్తున్నామన్నమాటేగా! దేశక్షేమానికి, పురోగమనానికి వినియోగపర్చవలసిన వారి అమూల్యమైన కాలాన్ని మన ఉత్సవ ప్రారంభానికి ఖర్చుపెట్టించి, సమాజశత్రువులుగా తయారవడం, మన ఆదర్శాలకి విరుద్ధం. కాన మనం ఎవరినీ శ్రమపెట్ట వద్దు' అన్నారు అధ్యక్షులుగారు.

* * *

మౌనంగా నిలబడి పైకి పాడని ప్రార్థనగీతంతో ఆనాటి కార్యక్రమం ప్రారంభమైంది. తరువాత 'ఆయుధవిసర్జన' జరిగింది. సభ్యులు వొక్కరొక్కరే వేదికపైకొచ్చి కలాలు, పెనసళ్లు, తెల్లకాగితాలు అధ్యక్షులముందు విసర్జనచేశారు.

ఆ పిమ్మట 'సంతాప ప్రమాణస్వీకారం' తంతు జరిగింది. ఆయా సభ్యులు వారు చేసిన అపచారాలు దాచకుండా చెప్పి వేసి, పశ్చాత్తాపం ప్రకటించి, చెంపలేసుకుని, 'ఇంక చెయ్యను' అని ప్రమాణస్వీకారంచేస్తారు.

ఈ సందర్భంలో మా 'వైవాహిత్' కి 'నహి గీతాచార్య' అని బిరుదు ప్రసాదించారు. ఎందుకంటారా? అతను ఈ సంవత్సరం భగవద్గీత జోలికి పోలేదుట. లోగడ గీతని బుర్రకథగా, జముకులకథగా, గొల్లసుద్దులుగా, వీధినాటకంగా, యుగళగీతంగా, అనేక స్వరూపాలలో వ్రాసివున్న దురంతాల వుదంతాన్ని యేకరువుపెట్టి ఈ పవిత్ర గ్రంథాన్ని ముందెప్పుడూ మలినంచెయ్యనని ఒట్టేసుకున్నాడు.

మూడవ హంశము అధ్యక్షులవారి ఉపన్యాసము. దీనిని ఏ పత్రికలూ ప్రచురించవు. ప్రచురించేటందుకు నాకూ అనుమతిలేదు. అయినా, కొన్ని భాగాలు వ్రాయక తప్పదు.

'మన సంఘంపట్ల కొన్ని సంస్థలు అసమ్మతి ప్రకటించాయి. కొన్ని పత్రికలు ఇట్లాంటి సంఘమే ఉండరాదనీ, దీన్ని ప్రభుత్వం రద్దుచెయ్యాలనీ సూచించారు. సారస్వతాభివృద్ధిని మా సంఘం నిరోధిస్తున్నదని వీరివాదం. మా సంఘం తలపెట్టిన కార్యక్రమం దేశమంతటా వ్యాపిస్తే ముద్రణాలయాలలో పనిచేసే వేలజనానికీ, ప్రచురణకర్తలకీ, పత్రికాలయాలకీ పనిలేకుండాపోయి నిరుద్యోగసమస్య తలెత్తుతుందనికూడా వీరు అంటున్నారు. ఇది కాదనలేము. దీనికిగాను వీరందరికీ యథావిధిగా పని కల్పించే సూత్రాన్ని అమలు జరుపుతున్నాము. మా సంఘంలో ఎవరెవరైందీ, సభ్యుల

సంగ్రహ జీవితగాథలు, వారి ఊహాజగత్తులో జరిగిన యుద్ధాలను, వారు ఏవిధంగా స్థూలప్రపంచంలో ప్రేరణ నెదుర్కొని ఆకర్షణలని జయించి చిత్తశుద్ధిని, ఆత్మశాంతిని అలవరుచుకున్నారో తెలియజేసే వొక సంచిక మొదాది చివరలో వెలువరిస్తాము. ఆ గ్రంథంలో రచయితలను గురించిన వివరాలు పొందుపరచబడతాయి. ఉదాహరణ లిస్తాను.

'వైవాహిత్' – అసలుపేరు వైదూరం వామన హరిప్రసాదరావు. చదువు – ఇంటర్ నాలుగుమార్లు ఫేలయ్యాడు. బి. ఏ. పరీక్షకు కూర్చోలేదు. వివాహం జరిగింది.

వీరి అముద్రిత గ్రంథాలు: 'శార్దూగోష్ఠి' 'కలగని సంతానం', 'ఖండకావ్యం','భగీరథుని తపస్సు'. అసలు వ్రాయని రచనలు: 'ఏదేశమేగినా' 'మెక్సికోలో విప్లవం' (వ్యాసాలు)

ఈ క్రింది వారిరచనలు వారు చదువలేదు: వాల్మీకి; నన్నెచోడుడు; వీరేశలింగం; థామస్ హార్డీ.

ఈ క్రిందివారిపేర్లుకూడా వినలేదు. జీన్ పాల్ సార్త్రే; కీర్క్‌గార్డ్.

అల్లాగే 'వృశ్చికం' – అనే పేరుతో సీరియల్ నవలా రచయితను గురించి యిల్లా వెయ్యవొచ్చు. వృశ్చికం – అసలుపేరు తేలుటూరు రంగయ్య. వారు పొందని అపూర్వ అనుభవం: తేలుకుట్టడం. వీరు వ్రాయనినవల: 'ఎందుకీ తొందర సుందరాకారా' బుర్రలోకూడా లేని గ్రంథం: 'బాణసంచా' (కథల సంపుటి)

వీరి అభిమానరచయితలు: ఖలీల్‌జిబ్రాన్, ఫిర్‌దౌసీ, 'కాఫ్కా', 'స్టీఫాన్‌జ్వేగ్'

ఈ పై వారి రచనలు మీరు చదవలేదు - వీరికి యీ పేర్లు బాగుంటాయి. అంతే.

కాలక్షేపం: పుస్తకాల కేటలాగులు పోగుచెయ్యడం. బొమ్మలపత్రికలలో బొమ్మలు చించకపోవటం.

ఒక రచయిత్రిని గురించి

'వీణాతంత్రి' - యీ పేరుతో పాఠకలోకానికి పరిచయం; కాని యీమె అసలు పేరు 'వరకట్నం ధనలక్ష్మి'

వివాహం: చేసుకోలేదు.

చదువు: ఇంట్లోనే.

కళాసాధన: ఊహాలో.

కాలక్షేపం: తెలుగు సినిమాలు చూడకపోవడం.

ఇష్టంలేని రచయిత్రిలు: మొల్ల, జేన్ ఆస్టిన్, ముద్దుపళని. షార్లోట్ బ్రాంట్.

అముద్రితగ్రంథం: మరి మొగాళ్ళమాటేమిటి?

(వ్యాసాలు). ఇందులో వున్న విషయాలను అన్నిపత్రికలూ వారికి కావల్సినవాటిని ఏరుకుని ప్రచురించవచ్చు.

అధ్యక్షుయ్యగారి ఉపన్యాసంలో మరో ముఖ్యభాగం:

'ఏ రచనా చెయ్యకుండా, పాండిత్యంగాని, సంస్కృతిగాని, భాషాపరిజ్ఞానంగాని యీషన్మాత్రమూ లేకుండా గొప్ప రచయితలుగా, సాహితీపరులుగా చలామణిఅయి, ఉన్నతపదవులు సంపాదించుకోడానికి, యీ సంఘం ఎత్తువేస్తున్నదని వొక అభియోగంచేశారు, కొందరు ప్రముఖులు. మా సంఘం చేస్తున్న కృషికి ఫలితం అది కావొచ్చు - కాని ఉద్దేశం మట్టుక అది కాదు. ఈనాడు సమాజంలో విశిన్న దృక్పథా

లున్నాయి. సంప్రదాయాలు, సాహితీవిలువలు తారుమారవు తున్నవి. ఈ మహాగంద్రగోళంలోంచి, చెత్తలోంచి మరుగుపడిన మణులను ఏరి చూపే విమర్శకు లున్నారు. మా సంఘం ఈ చెత్తని పెంచకుండా చేస్తుంది. చెత్త తగ్గినకొద్దీ, విమర్శకుడి పని సులువవుతుంది. గొప్పగ్రంథా లేవో నిర్ణీతమవుతాయి. వాదాలు, సిద్ధాంతాలు, పోటీలు సమసిపోతాయి. ప్రపంచశాంతి ప్రబలుతుంది. ఇది సేవ కాదంటారా?'

వ్రాయబడని రచనలను చెత్తగా పరిగణించడం సభ్యులకు నచ్చలేదు. వ్రాసివుంటే గొప్పరచనలవును - సభ్యులందరూ వ్రాయగల గొప్ప గ్రంథకర్తలు. అట్టివారి కృషిని చెత్తకింద కట్టెయ్యడంపట్ల అసమ్మతిని తెలియచేశారు. అధ్యక్షులవారిని తమ ఉపన్యాసాన్ని నిలపమన్నారు. క్షమాపణ చెప్పమన్నారు. వారు దాని కంగీకరించలేదు. క్షమాపణ చెప్పకపోతే సభ్యులందరూ రాజీనామా యిచ్చి, వారి వారి కలాలు, కాగితాలు పట్టుకపోతామన్నారు. మా 'మధురాంతకం' వొక కొత్త సూత్రాన్ని ప్రతిపాదించాడు. 'రచనలు చెయ్యకపోవడమే కాకుండా, ప్రతిభాశాలి అయిన ప్రతి సభ్యుడూ ఉపన్యసించకూడదు. గ్రామభాష ప్రబలి, ఉపన్యాసానికీ, రచనకీ తేడా లేకుండా పోతూంది గనక యీ సంఘం యింకనుంచి వుపన్యాసాలు మానుకోవాలి.'

దీన్ని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించి, అధ్యక్షులవార్ని వుపన్యసించడం మానుకోమన్నారు.

'మరి ప్రేక్షకజనసభమాటేమిటి?' అన్నా రాయన.

'వారూ మౌనం వహించి, ఏకాంతాన్ని ఆస్వాదించి, సమాధిలోపడి, దాన్నుండి జనించే శూన్యరసాన్ని ఆస్వాదించాలి' అన్నాడు మధురాంతకం.

కార్యక్రమంలో యీ భాగాన్ని 'శూన్యరసాస్వాదనా కృత్యం' అన్నారు. ప్రేక్షకజనానికి యిది నచ్చలేదు. అల్లరి సాగించారు – కేకలు, యీలలు, అధ్యక్షయ్యగార్ని గూర్చి అపనాదుతో కూడుకున్న నినాదాలు సాగించారు.

ఈ అధ్యక్షయ్య ఏ రచనా చెయ్యలేదంటే మేం నమ్మం, 'అ, ఆ', 'ఇ, ఈ,' అని మారుపేరెట్టుకుని, మూడు ఖండకావ్యసంపుటాలు ప్రచురించాడు. 'రెండు రెళ్ళు మూడు' అన్న పేరుతో 'నలుగురు శత్రువులు' అన్న నవల ప్రచురించాడు. 'అబద్ధాల అధ్యక్షయ్య' – అంటూ చేసిన ప్రేక్షకుల నినాదాలు మిన్ను కెగసినవి.

అప్పుడు అధ్యక్షయ్యగారు మరొక కర్మకాండ శాసించారు. మొదటిది 'కవచ విసర్జన' – అనగా మారు పేర్లతో, (సకుబ, హంగుదార్, రణవీర్ మొదలైనవి) రహస్యంగా రచనలు సాగిస్తున్న సభ్యులు కవచాలను (మారు పేర్లను) వదిలేసి, నిజస్వరూపం (నామధేయం) బహిరంగం చెయ్యాలి. రెండోదానిపేరు 'అపవాద ఉపసంహార కృత్యం' – అనగా ప్రేక్షకులలో వొకరు సభ్యుడు మారుపేరుతో రహస్యంగా చేసిన రచనని బైటపెట్టడం (అపవాదువెయ్యడం) – అవతల వ్యక్తి పశ్చాత్తాపం చెంది, గుంజీలు తీసి, లెంపలేసుకుని (ఉపసంహారం).

* * *

'ఏమండోయ్–లేవండి, పట్టపగలే కలలేమిటి? ఆ లెంప లేసుకోడం ఏమిటి? లేవండి, కాసిని మంచినీళ్ళు త్రాగండి' అంటూ ఆవిడ లేపింది.

'ఏదో వ్రాసి యిస్తామన్నారుటగా – ఆయనెవరో వొచ్చాడు చూడండి' అన్న దామె.

'జ్వరంగా వుంది, రేపు రమ్మందూ' అన్నాను.

'ఇంక యివ్వనక్కర్లేదుట. వారి పత్రిక నిలచిపోయిం దిట' అన్న దామె.

'అమ్మయ్య!' అనుకుని మళ్ళీ పడుకున్నాను.